నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | జనవరి 28, 2025 | www.navatelangana.com

మహా శివరాత్రికి శ్మశానవాటిక ప్రారంభం

నవతెలంగాణ-మంచిర్యాల

మహా శివరాత్రి వరకు శ్మశాన వాటికను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు పరుస్తానన్నారు. నియోజకవర్గానికి 650 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా మహాప్రస్థానాన్ని తలపించేలా శ్మశాన వాటిక నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మాతా శిశు హాస్పిటల్ నిర్మాణం, రోడ్డు వెడల్పు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్లో ఆదిలాబాద్, నిర్మల్ నివేదికలు



సంగారెడ్డిలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాల్గో మహాసభల్లో జిల్లాల నివేదికలు ప్రవేశపెడుతున్న ఆ పార్టీ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, నిర్మల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొమ్మెన సురేష్

బల్దియాల్లో ప్రత్యేక పాలన..!

- ఈ నెల 26 నాటికే ముగిసిన పాలకవర్గాల పదవీకాలం
- ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు
- ఎన్నికలు జరిగే వరకు వీరి కనుసన్నల్లోనే పాలన
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన ఎన్నికల వాతావరణం

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. ఈ నెల 26వ తేదీ నాటికే పాలకవర్గాల పదవీకాలం ముగిసిపోవడంతో సోమవారం నుంచి అధికారులు ఆయా మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. వార్డులకు సైతం ఇంఛార్జీలను నియమించారు. బల్దియా ఎన్నికలకు ఇంకా సమయం ఉండటంతో అప్పటి వరకు అధికారుల కనుసన్నల్లోనే పాలన కొనసాగనుంది. మరోపక్క రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గత ఏడాది కాలంగా మున్సిపాలిటీల్లో పాలన కొంత స్తబ్ధుగా కొనసాగింది. కొన్ని మున్సిపాలిటీలను అవిశ్వాస తీర్మాణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే కైవసం చేసుకోగా.. మరికొన్నింటిలో బీఆర్ఎస్‌కు చెందిన వారే కొనసాగుతూ వచ్చారు. దీంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్), వంటి వివిధ రకాల నిధులు రాలేకపోయాయనే అభిప్రాయం ఉంది. తాజాగా బల్దియా పాలకవర్గాల గడువు ముగిసిపోవడంతో ఎన్నికలు జరిగే వరకు అధికారులు ఇంఛార్జీలుగా వ్యవహరించనున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పాలకవర్గాల గడువు ముగిసిపోవడంతో వాటిలో జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. మున్సిపాలిటీలకు మళ్లీ ఎన్నికలు జరిగే వరకు వీరి కనుసన్నల్లోనే పాలన కొనసాగనుంది. ఉమ్మడి జిల్లాలో 11 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆదిలాబాద్, నిర్మల్, ఖానాపూర్, భైంసా, కాగజ్‌నగర్, మంచిర్యాల, నస్పూర్, క్యాతన్‌పల్లి, చెన్నూర్, బెల్లంపల్లి, లక్సెట్టిపేట ఉండగా.. ఇటీవలే నస్పూర్‌ను మంచిర్యాలలో విలీనం చేసి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మందమర్రి ఏజెన్సీ ప్రాంతంగా ఉండటంతో ఇక్కడ ఎన్నికలు జరగలేదు. ఉమ్మడి జిల్లాలో 2020 ఆగస్టు 7న పాలకవర్గాల పాలన ప్రారంభమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి పేరిట ప్రతి నెలా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పార్కులు, ఓపెన్‌జిమ్‌లు, రోడ్ల విస్తరణ, సుందరీకరణ, ప్రధాన కూడళ్ల అభివృద్ధి తదితర వాటిని చేపట్టారు. ప్రభుత్వం వివిధ రకాల నిధులను మంజూరుచేయడంతో అభివృద్ధి పనులు జోరుగా సాగాయి. కరోనా కాలం అనంతరం ప్రభుత్వం నుంచి నిధుల రాకలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో అభివృద్ధి పనులు మందగించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఏడాది కిందట ప్రభుత్వ మార్పు జరగడం..కొన్ని మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మాణాలతో పలు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మరికొన్ని వాటిలో మాత్రం యథావిధిగానే కొనసాగాయి.

ప్రత్యేక అధికారుల నియామకం..!

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పాలకవర్గాల పదవీకాలం ముగిసిపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి స్థానిక సంస్థల అధికారి కుష్బుగుప్తా ప్రత్యేక అధికారిగా నియమితులు కాగా నిర్మల్, భైంసా, ఖానాపూర్ బల్దియాలకు నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను నియమించింది. కాగజ్‌నగర్ బల్దియాకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మంచిర్యాల, బెల్లంపల్లి, క్యాతన్‌పల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట మున్సిపాలిటీలకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. మరోపక్క ఆయా వార్డులకు సైతం ఇంఛార్జీ అధికారులను నియమించనున్నారు. మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగే వరకు వీరి కనుసన్నల్లోనే పాలన కొనసాగనుంది.

అప్పుడే ప్రారంభమైన కోలాహలం..!

మున్సిపాలిటీలకు పాలకవర్గాల పదవీకాలం ముగిసిపోవడంతో అప్పుడే ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. కొన్ని రోజుల నుంచే ఆయా మున్సిపాలిటీలకు చైర్మెన్ పదవులు ఆశిస్తున్న వివిధ పార్టీల నాయకులు ప్రజల మధ్య ఉంటూ పరోక్షంగా ప్రచారాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఆ పార్టీకి చెందిన ఆశావహులు ఎక్కువ మంది ఈ పదవులను ఆశిస్తున్నారు. ఇక బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన వారు సైతం పోటీ చేసి మున్సిపాలిటీలను కైవసం చేసుకోవాలని భావిస్తున్నారు. ముఖ్యంగా ఎన్నికలకు ఇంకా కొన్ని నెలల పాటు సమయం ఉన్నప్పటికీ.. ఆయా వార్డులకు పోటీ చేసేందుకు ఇప్పట్నుంచే ఆశావహులు ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు వార్డు ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా అవసరమైన సహకారం అందించడం వంటి కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. దీంతో బల్దియాల్లోనూ ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది.

ఉత్కంఠభరితంగా క్రికెట్ మ్యాచ్



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో మొదలైన 11వ సీజన్ క్రికెట్ లీగ్-2025లో భాగంగా సోమవారం కర్మ వారియర్స్ వర్సెస్ పవర్ స్మాషర్స్ జట్టు మధ్య జరిగిన మ్యాచ్ ఉత్కంఠభరితంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన పవర్ స్మాషర్స్ జట్టు నిర్ణీత 12 ఓవర్లల 6 వికెట్లు నష్టానికి 98 పరుగులకు పరిమితమైంది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కర్మ వారియర్స్ 4 వికెట్ల నష్టపోయి 99 పరుగులతో విజయం సొంతం చేసుకుంది. జట్టు కెప్టెన్ అజయ్ 42 పరుగులతో మ్యాచ్ కొనసాగించగా మరో క్రీడాకారుడు సంతోష్ 20 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 35 పరుగులు సాధించి జట్టుకు గెలుపుకు చేరువ చేశారు. జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించిన సంతోష్ మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్‌గా నిలిచారు. ఫస్ట్ ఆఫ్‌లో ఎస్టీపీపీ పైలెట్స్ వర్సెస్ పవర్‌మేక్ గేమ్ చేంజర్స్ జట్ల మధ్య పోటీ కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన పైలెట్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 66 పరుగులకు పరిమితమై 8 వికెట్లు నష్టపోయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన గేమ్ చేంజర్స్ జట్టు 8.2 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 67 పరుగులతో విజయాన్ని సొంతం చేసుకుంది. నాలుగు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లలో అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రిజ్వానుద్దీన్, సంతోష్ మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్‌గా నిలిచి అవార్డులు సొంతం చేసుకున్నారు.

మున్సిపల్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-నిర్మల్

మున్సిపల్ ప్రతినిధుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు సహకరించాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమయానికి అన్ని రకాల పన్నుల వసూలును పూర్తి చేయాలని తెలిపారు. ప్రగతికి సంబంధించి నివేదికలను ఎప్పటికప్పుడు తమకు అందజేయాలని తెలిపారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఇటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ హరిభువన్, పట్టణ ప్రణాళిక అధికారి హరీష్, ఆర్వో అనూఫ్, మెప్మా పీడీ సుభాష్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఐక్యత సభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల



జనవరి 28న ఖమ్మంలో జరిగే ప్రగతిశీల ప్రజాసామ్య విద్యార్థి సంఘం ఐక్యత సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని విస్మరిస్తుందన్నారు. గురుకులాల్లో పిట్టల్లా విద్యార్థులు చని పోతుంటే కనీసం ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని, స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ఇవ్వకుండా విద్యార్థులను చదువుకు దూరం చేస్తోందని తెలిపారు. శాస్త్రీయ విద్య ధ్యేయంగా సమ సమాజ స్థాపన కొరకు పీడీఎస్‌యూ పని చేస్తోందని తెలిపారు. మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్తీక్, తిరుపతి, దీపిక, వైష్ణవి, అంజి పాల్గొన్నారు.

విద్యార్థులకు షీ టీం అవగాహన

నవతెలంగాణ-బోథ్



మండలంలోని కౌట(బి) జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీం ఇన్‌చార్జి, హెడ్ కానిస్టేబుల్ బి.సుశీల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపిల్లలు బయటకు వెళ్లిన సమయంలో అపరిచిత వ్యక్తులు అసభ్యకరంగా మాట్లాడినా, ప్రవర్తించినా 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. హెల్ప్ లైన్‌తో అవసరమైన వాటిని సేకరించాలని, తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయొద్దని తెలిపారు. అలాగే తెలియని వ్యక్తులతో ఫొటోలు దిగడం చేయకూడదని, లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శశిధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగాపూర్ జాతర పోస్టర్ విడుదల



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఫిబ్రవరి 11 నుండి 13 వరకు జరిగే బాలాజి వెంకటేశ్వర స్వామి జాతర పోస్టర్లను సోమవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆవిష్కరించారు. అనంతరం వారికి జాతర ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ జయరాం, మండల అధ్యక్షులు లావుడ్యా రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గం దేవాజీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు మోడెమ్ సుదర్శన్‌గౌడ్, బాలేష్ గౌడ్ పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం


- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- వాలీబాల్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-సిరికొండ

తరాలు మారుతున్న కొద్ది సంస్కృతి, సాంప్రదాయాలను నేటితరం యువకులు మరిచిపోతున్నారని, అవి జాతి ఉనికికి చిహ్నాలని వాటిని కాపాడుకుందామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని వాయిపేట్ గ్రామ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పాటిస్తున్న ఆచార వ్యవహారాలను తూచ తప్పకుండా పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాయి సెంటర్ పెద్దలు, గ్రామ పటేళ్లు నేటి యువతకు దిశా నిర్దేశం చేస్తూ ఉండాలని సూచించారు. యువత క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలన్నారు. తాత్కాలిక ఆనందం కోసం కాకుండా గొప్ప లక్ష్యాలను పెట్టుకుని ఆ లక్ష్యసాధన దిశగా ప్రయత్నించాలన్నారు. గ్రామస్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని తెలిపారు. రసాయన వాడకాలతో భూసారం తగ్గి భూమికి తీవ్ర నష్టం వాటిల్లతోందన్నారు. రోగాల బారిన పడకుండా ఉండాలంటే రసాయనాల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వాడకాన్ని పెంచాలని, దీంతో భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నియోజకవర్గంలో త్వరలో రూ.36కోట్లు నిధులు మంజూరు కానున్నాయని, వీటితో అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అసెంబ్లీలో అల్లంపల్లి, వాయిపేట్ గ్రామాల అభివృద్ధికి గళం విప్పామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపురావ్, మహంకాళి ఆలయ పూజారి కినక శంభు మహారాజ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇమామ్, నాయకులు రఘురాం, ప్రకాష్, లచ్చిరాం పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2న బర్డ్ వాక్, నేచర్ ట్రయల్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అటవీ పర్యాటకులకు కాగజ్‌నగర్ అటవీ డివిజన్ మంచి అవకాశాన్ని కల్పిస్తోంది. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం (వరల్డ్ వెట్‌ల్యాండ్స్ డే) పురస్కరించుకొని ఫిబ్రవరి రెండో తేదీన కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలోని పెంచికల్‌పేట్ రేంజ్‌లో పర్యాటకుల జంగిల్ సఫారీకి ముందుకు వచ్చింది. ఫిబ్రవరి ఒకటో తేదీన మధ్యాహ్నం 2-30కు కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని అదేరోజు మధ్యాహ్నం 3-30కు ట్రెక్కింగ్ (అడవిలో నడక) మరియు నేచర్ ట్రయల్ (ప్రకృతి బాట)కు తీసుకువెళతారు. రాత్రి 8-30కు డిన్నర్ అయిన తర్వాత అటవీ ప్రాంతానికి సమీపంలోనే రాత్రి బసకు ఏర్పాట్లు చేశారు. రెండో తేదీన ఉదయం ఆరు గంటలకు పెంచికల్‌పేట రేంజ్ పరిధిలోని ఎల్లూరు చెరువుకు బర్డ్ వాక్ (పక్షుల సందర్శన) కోసం తీసుకువెళతారు. 9 గంటలకు అల్పాహారం అనంతరం పది గంటలకు దట్టమైన అటవీ ప్రాంతంలోనికి సఫారీలో తీసుకువెళ్లి అటవీ అందాలను వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు. మధ్యాహ్నం లంచ్ అయిన తర్వాత తిరిగి కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయానికి తీసుకువస్తారు. ఇందుకు గాను ప్రతీ ఒక్కరు అటవీ శాఖకు రూ. 1,500 చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ సంఖ్యలో పర్యాటకులకు అనుమతి ఉన్నందున త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అటవీ శాఖ సూచిస్తోంది.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గోడవెల్లి గ్రామంలో గల మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలుర పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, సరుకుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, వంట సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని తెలిపారు. భోజనం వండక ముందు, వండిన తరువాత ఫొటోలు క్రమం తప్పకుండా తీయాలని, పాఠశాల కమిటీ వండిన భోజనాన్ని విద్యార్థులు తినకముందు రుచి చూడాలని తెలిపారు. పాఠశాల, కళాశాల భవనాన్ని, వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు సరిపడా స్నానపు గదులు, మూత్రశాలలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రణాళికాబద్ధంగా సిలబస్ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అధికారుల ఆర్థిక చేయూత

నవతెలంగాణ-ముథోల్



పింఛన్ డబ్బుల కోసం తల్లిని హత్య చేసిన చిన్న గజ్జన్న జైలుకు వెళ్లగా కొడుకు, కూతురు అనాథలుగా మారారు. సోమవారం ఎంపీడీవో శివకుమార్ గ్రామానికి చేరుకొని పిల్లలతో మాట్లాడారు. తన వంతుగా రూ.5000తో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి ఎవరైన కాంట్రాక్టర్‌తో కట్టించేందుకు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. తహసీలాదర్ శ్రీకాంత్ తనవంతుగా రూ.5000 ఆర్థిక సాయంతో పాటు 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. పిల్లల పేర్లను వెంటనే రేషన్ కార్డులో యాడ్ చేసి మంజూరు పత్రాన్ని అందజేశారు. పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తనవంతుగా 25 కిలోల బియ్యం అందించారు. అనాథలైన పిల్లలను సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు చేపడతామని ఎంపీడీఓ, తహసీల్దార్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన నాయకులు రావుల శ్రీనివాస్ తన వంతుగా రూ.10వేలు అందజేయడంతో పాటు దాతలు చిన్నారులకు ఆర్థిక చేయూత ఇవ్వాలని వాట్సాప్ ద్వారా ప్రచారం చేస్తున్నారు.

మహిళలు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జైపూర్ : ఆడ పిల్లలు, మహిళల శ్రేయస్సు కోరి ఆపద సమయంలో ఆదుకోవడం కోసం రూపొందించిన సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక సూచించారు. సోమవారం భీమారం మండల కేంద్రంతో పాటు నర్సింగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అత్యవసర సేవలను వివరించారు. బేటీ బచావో-బేటీ పడావో, పీసీపీఎన్ డీటీ యాక్ట్ (గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్టం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సఖీ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెం.181, చైల్డ్ హెల్ప్‌లైన్ నెం.1098, డిజిటల్ ఎడ్యుకేషన్, పోలీస్ హెల్ప్‌లైన్ నెం.100, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ నెం. 14567, పోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాలు, గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్, నేషనల్ ఎమర్జెన్సీ నెం. 112, ఆన్‌లైన్ సెఫ్టీ, సైబర్ క్రైమ్, సుకన్య సమృద్ధియోజన, మిషన్ వాత్సల్య, టీ సేఫ్ ఆప్, ఆడ పిల్లల ప్రాముఖ్యత తదితర విషయాలపై అవగాహన కల్పించారు.



అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాలల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక పాల్గొన్నారు.

స్వర్ణ నుండి సాగు నీటిని విడుదల చేయాలని వినతి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



స్వర్ణ జలాశయం నుండి సాగు నీటిని విడుదల చేయాలని కోరుతూ నిర్మల్ రూరల్ మండలం వెంగ్వాపేట్, తల్వేద, చిట్యాల్ గ్రామాల రైతులు సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుకు క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేసినట్లయితే రబీ పంట సాగు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. స్పందించిన డీసీసీ అధ్యక్షులు వెంటనే ఇరిగేషన్ ఏఈతో మాట్లాడి సాగునీటిని విడుదల చేయాలని సూచించారు. రైతులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు సాద సుదర్శన్, పార్టీ మండల అధ్యక్షులు కుంట వేణుగోపాల్, కుదారపు రాకేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | జనవరి 28, 2025 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ వాజిద్ అహ్మద్‌ఖాన్ సోదరి ఇటీవల అనారోగ్యం మరణించారు. విషయం తెలుసుకున్న నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు కుచాడీ శ్రీహరిరావు జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో వారి నివాసంలో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి,



మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబానికి ప్రగాడ సంతాపం తెలిపారు. ఆయన వెంట సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ అబ్దుల్ హాదీ, సబా కలీం, నాయకులు అతీక్ అహ్మద్, మాజీ ఎంపీపీ నరేష్‌రెడ్డి, మజార్ ఉన్నారు.

ఇచ్చోడ మండల వాసికి జీవన సాఫల్య పురస్కారం

నవతెలంగాణ-ఇచ్చోడ

ఇచ్చోడ మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన ఐఎఫ్ఎస్ అధికారి గోపిడి చంద్రశేఖర్‌రెడ్డికి జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. సోమవారం తాను పుట్టిన ఊరు బోరిగామలో అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ఆయన బంధువులు, స్నేహితులు మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో ఆదివారం జరిగిన ఎట్ హోమ్ కార్యక్రమంలో భాగంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా డా.గోపిడి చంద్రశేఖర్ రెడ్డి జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకోవడం చాల సంతోషంగా ఉందని అన్నారు.



నాగోబా జాతరకు వేళాయె...

- రేపు కేస్లాపూర్‌లో నాగోబాకు మహాపూజ
- మర్రిచెట్టు వద్దకు చేరుకున్న మెస్రం వంశీయులు
- ఏర్పాట్లను ముమ్మరం చేసిన అధికారులు
- జాతరకు సీతక్కతో పాటు దేవాదాయశాఖ మంత్రుల రాక



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసుల ఆరాధ్యదైవం రాష్ట్ర పండుగైన కేస్లాపూర్ జాతరకు వెళయింది. పుష్యమాసం అమావాస్య అర్ధరాత్రి నుంచి మెస్రం వంశీయులు ఇక్కడ పూజ చేయనున్నారు. ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టేలా నాగోబా మహా పూజకు మెస్రం వంశీయులు సిద్ధమయ్యారు. ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఈ జాతర ఫిబ్రవరి 2 వరకు అధికారికంగా సాగనుంది. మెస్రం వంశీయులు కాలినడకన గోదావరి హస్తినమడుగు నుంచి సేకరించిన గంగా జలంతో 24న మర్రిచెట్టు వద్దకు చేరుకున్నారు. ఇక్కడ పీఠాధిపతి వెంకట్‌రావ్‌కు ఆహ్వానం పలికారు. పూజకు ఒక రోజు ముందు తూమ్ పూజలను నిర్వహించారు.

మహా పూజలు ఇలా..

మర్రిచెట్టు వద్ద వివిధ సాంప్రదాయ పూజలు చేసిన మెస్రం వంశీయులు పూజ రోజున 28న మంగళవారం డోలు, పెప్రే, కాళికొమ్ వాయిస్తూ నాగోబా ఆలయానికి చేరుకుంటారు. అదే రోజు సాయంత్రం ఎడ్ల బండ్లను నాగోబా ఆలయం పక్కనే ఉన్న గోవాడ్ (ప్రత్యేక కట్టడం) వద్దకు తీసుకెళ్లి బస చేస్తారు. ముందుగా మర్రిచెట్టు వద్ద ఉన్న పవిత్ర కోనేరు నుంచి మట్టి కుండల్లో మెస్రం వంశం అల్లుండ్లు నీరు తోడుతారు. ఆడపడుచులు ఆ నీటిని ఆలయం ప్రాంగణంలోకి తీసుకువెళ్తారు. అదే నీటితో ఆలయం పక్కనే ఉన్న పాత మట్టి పుట్టను అల్లుండ్లు తవ్వుతారు. ఆడపడుచులు అదే మట్టితో కొత్త పుట్టను తయారు చేస్తారు. ఆ పుట్టనుంచి మట్టిని ఉండల రూపంలో తీసుకుని ఏడు వరుసలో భౌల దేవతను ప్రతిష్టిస్తారు. అనంతరం సతీ దేవతల భౌలను తయారు చేసి, సాంప్రదాయ రీతిలో పూజలు చేయడం జరుగుతోంది.



రూ.10 కోట్లతో మందిరం నిర్మాణం..

గత ప్రభుత్వ హయంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో మందిరం నిర్మాణంతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించారు. మెస్రం వంశీయుల వివిధ గ్రామాల నుంచి సేకరించిన విరాళాలతో రూ.6 కోట్లు సేకరించి గుడి గోపురం నిర్మాణం చేపట్టారు. దేవాదాయశాఖ ద్వారా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నుంచి తెచ్చిన రాతితో అద్దం పట్టేలా గుడి గోపురం నిర్మాణం చేశారు. నాలుగు ప్రాకార మండపాలను నిర్మించారు.

రాత్రి మహాపూజ ఇలా..

అమావాస్య రోజున పవిత్ర గంగా జలంతో ఆలయాన్ని శుద్ధి చేసి, నాగోబాకు జలాభిషేకంతో మహా పూజలను ప్రారంభిస్తారు. ఈ పూజలకు ఇతరులకు ప్రవేశం ఉండదు. అధికారులు ఇతర ప్రముఖులకు ఆలయంలోకి ప్రవేశం కల్పిస్తారు.

భేటింగ్ (పరిచయ) కార్యక్రమం..

మహా పూజ అనంతరం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి మెస్రం వంశములో ఇప్పటి వరకు నాగోబా సన్నిధికి రాని కోడళ్లను కుటుంబ సభ్యులు వంశ పెద్దలను పరిచయం చేస్తారు. వారి నుంచి ఆశీస్సులు పొందుతారు. దీనిని భేటింగ్ అంటారు. ప్రతి ఏటా పదుల సంఖ్యలో ఈ భేటింగ్‌లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంతో నాగోబా జాతర ప్రారంభమైనట్టు ప్రకటిస్తారు.

కీతల వారిగ వంట పొయ్యిలు...

అనంతరం గోవాడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు ముగింపు వరకు 22 కితాలు (వర్గాలు)గా పొయ్యిలు ఏర్పాటు చేసి వంటలను చేసి నైవేద్యాలను సమర్పిస్తారు. అనంతరం సహ పంక్తి భోజనాలను చేస్తారు.

పెర్సాపేన్‌కు పూజలు..

నాగోబా పూజ అనంతరం రెండో రోజు ఆలయం వెనుక ఉన్న పెర్సాపేన్ దేవతకు పూజలు చేస్తారు. ఈ పూజను కేవలం పురుషులు మాత్రమే చేస్తారు.

భాన్ దేవతకు పూజలు..

మూడో రోజున భేటింగ్‌లో పాల్గొన్న మెస్రం కోడళ్ల మర్రి చెట్టు వద్ద ఉన్న కోనేరు నుంచి మట్టి కుండల్లో తెచ్చిన నీటితో భాన్ దేవతకు సమర్పించి పూజలు చేస్తారు. ఈ పూజలో మహిళల భాగస్వామ్యం అధికంగా ఉంటోంది.

31న దర్బార్...

ఆదివాసీ జీవితాల్లో నాగోబా దర్బార్‌కు పెద్ద పీట ఈ దర్బార్‌కు 79 వసంతాలు కావస్తోంది. 1940లో కెరామెరి జోడేఘాట్‌లో అమర వీరుడు కుమురంభీం నిజాం సైనికుల తూటాలకు అమరుడయ్యారు. ఆ తరువాత ఇంగ్లాండుకు చెందిన మానవ పరిణామ శాస్త్ర వేత్త హైమాన్ డార్ఫ్ 1946 నుంచి ఈ దర్బార్‌ను ప్రారంభించారు. ఈ దర్బార్ వేదికలో ఆదివాసుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేవారు. అప్పటి నుంచి ఈ దర్బార్ కొనసాగిస్తూనే ఉన్నారు.

బేతల్ పూజలు నృత్యాలు..

నాగోబా జాతర చివరి ఘట్టం ఇది. దర్బార్ పూర్తైన తరువాత మెస్రం వంశీయులు గోవాడ్ పక్కనే బేతల్ (కర్ర సాము) ఆట, నృత్యాలతో ముగింపు పలుకుతారు. ఈ సందర్భంగా భేటింగ్ కోడళ్ల, మెస్రం మహిళలు ప్రధాన్‌లకు కట్నం కానుకలను సమర్పిస్తారు. అనంతరం వెదురు కర్రతో బేతాల్ నృత్యాలు, మండ గాజలింగ్ సాంప్రదాయం నిర్వహించి, నాగోబా జాతరకు వీడ్కోలు పలుకడం వారి ఆచార సాంప్రదాయం.

జాతరకు అధికారుల ఏర్పాట్లు...

28న నాగోబా పూజతో ప్రారంభమయ్యే జాతరకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం శాఖల వారిగా పర్యవేక్షిస్తున్నారు. నాగోబా ఆలయం వరకు బారికెడ్లు, తాగునీరు సరఫరా, పోలీసు క్యాంపు, ఆలయానికి రంగులు, విద్యుత్ అలంకరణ, సానిటేషన్, ప్రభుత్వ పతాకాలపై వివిధ స్టాళ్లను ఏర్పాట్లను చేయడంలో నిమగ్నమయ్యారు.





పేదలకే మొదటి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

పేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందజేయడంలో ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను ఇస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల నమూనా నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులు, కాంగ్రెస్ నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లతో పాటు పెంకుటిల్లు, కట్టెలతో నిర్మించిన వారికీ మొదటగా ప్రాధాన్యత కల్పిస్తూ, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని, ప్రజలెవరు ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన సర్వే లిస్టులో అర్హులు లేని వారి పేర్లు నమోదై ఉంటే వాటిని తొలగించి, పేద కుటుంబాలకు న్యాయం చేస్తామన్నారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ కోడిగుడ్ల బిల్లులు చెల్లించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల కోడి గుడ్ల బిల్లులను చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటి సభ్యుడు కుంటాల రాములు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం కోడి గుడ్డు పెట్టాలని చెబుతున్న అధికారులు దానికి అనుగుణంగా బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శ్రీదేవి, నాగమణి, రాంబాయి, పుష్ప, ఇస్రు, రుక్మాబాయి, శకుంతల, అనిత పాల్గొన్నారు.

యూడైస్ ప్లస్‌పై వర్క్ షాప్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణంలోని విన్నర్స్ పాఠశాలలో సోమవారం జిల్లాలోని అన్ని మండలాల ఎంఐఎస్, సీసీఓ, సీఆర్పిలకు యూడైస్ ప్లస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రామారావు మాట్లాడుతూ యూడీఐఎస్‌ఈనకు సంబంధించి అన్నీ పనులు సమయానికి పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల పూర్తి సమాచారం, మార్పులు-చేర్పులు, అపార్ నమోదు, ఉపాధ్యాయుల వివరాలు అన్నీ అంశాలను నమోదు చేయాలని. ప్రతీ ఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. మండల విద్యాధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజేశ్వర్, సి.లింబాద్రి, కేజీబీవీ సమన్వయ కర్త సలోమీ కరుణ, డీఈఓ నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంద కృష్ణకు పద్మశ్రీ రావడం హర్షణీయం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగకు ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడం హర్షణీయమని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కాంబ్లె బాలాజీ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మంద కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీ ఉపకులలా వర్గీకరణ అయ్యేంత వరకు పోరాటం ఆగదన్నారు. దానిలో భాగంగానే హైదరాబాద్‌లో తలపెట్టిన వెయ్యి గొంతుకలు, లక్ష డప్పులు.. అనే నినాదంతో తరలించే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టినట్టు పేర్కొన్నారు. అనంతరం ఒకరి కొకరు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాధవ్, నర్సయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని బోరిగామ గ్రామనికి చెందిన సొన్న పుష్ప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ సోమవారం బోరిగామ గ్రామంలో బాధితుల ఇంటికి వెళ్లి ఉషోదయ అసోసియేషన్ యూత్ సభ్యులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఉషోదయ అసోసియేషన్ యూత్ తరపున రూ.10వేలు, ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ రూ.5వేలు మృతురాలు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. మృతురాలి భర్త సొన్న శేఖర్‌తో మాట్లాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లి రవి, వైస్ ప్రెసిడెంట్ రమణయ్య, ప్రధాన కార్యదర్శి తాడూరి స్వామి, జంగిలి రమణ, మురళి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. లింగాపూర్ మండలం మల్కాగూడ గ్రామానికి చెందిన కొడప మారు తన పొలానికి త్రిఫెజ్ విద్యుత్ ఇప్పించాలని, ఆసిఫాబాద్ మండలం దేగాం గ్రామానికి చెందిన పోచమ్మ తనకు బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. ప్రజావాణిలో ఏపీఓ పీవీటీజీ మెస్రం మనోహర్, పీహెచ్‌ఓ సందీప్ కుమార్, ఏఓ దామోదర్ స్వామి, (పేసా కోఆర్డినేటర్) వసంతరావు, మేనేజర్, జెడీఎం నాగభూషణం, డీపీఓ ప్రవీణ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

పారదర్శకంగా నాలుగు సంక్షేమ పథకాల అమలు జరుగుతుందని, ఎవరికి అన్యాయం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, అర్హులైన వారికి 100శాతం పథకాలు పారదర్శకంగా అమలు అవుతాయని స్పష్టం చేశారు. నిరుపేదలకు మొదటిగా ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామని తెలిపారు. రైతు ఆత్మీయ భరోసా పథకంలో ఉపాధి హామీ పనులలో 2023-24 సంవత్సరాల్లో కనీసం 20 రోజులు పని చేసి ఉండాలని, అలాంటి వారికే ఈ పథకం వర్తిస్తుందన్నారు. రేషన్ కార్డులు లేని వారికి కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్నారు. పట్టా ఉండి సాగులో ఉన్న ప్రతి ఒక్క రైతుకు రైతు భరోసా పథకం అందిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని, ప్రతి పేదవాడికి 100శాతం సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే వదంతులను నమ్మొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులు కంటి పరీక్షలు

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థిని విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్ కృష్ణవేణి కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి, జిల్లా కేంద్రంలోని రిమ్స్ కు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా చదువుకునే విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులను రిమ్స్‌కు పంపించి మరిన్ని కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థిని విద్యార్థులు దృష్టిలోపం రాకుండా ఆకుకూరలు, గుడ్లు తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్, ఫార్మసిస్ట్ కిషోర్ కుమార్, ఏఎన్ఎం ఐశ సిద్ధిఖా, కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్, సంతోష్ పాల్గొన్నారు.



పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో రూ.25లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం కాంగ్రెస్ బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. మండల కేంద్రంలో చేపట్టిన సీసీ రోడ్, డ్రైనేజీ పనులను, త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, మాజీ సర్పంచ్ జనార్ధన్, జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి రాజురెడ్డి, మధుకర్, మాజీ సర్పంచ్ జనార్దన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాయుడి రవి, మైనారిటి మండలాధ్యక్షుడు షేక్ వకీల్, మాజీ సర్పంచ్ ఆత్రం నగేష్, సయ్యద్ అన్వర్, ఇసాక్, మనోజ్, అసిఫ్, భూమన్న, మోహన్, షేక్ తాజముల్, జాదవ్ కపిల్ దేవ్, యువ నాయకులు ఆడే సతీష్ కుమార్, ఎండీ సద్దాం, పాల శంకర్ పాల్గొన్నారు.



ఘనంగా ఎలక్ట్రిషన్ దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఎలక్ట్రికల్ పితామహుడు థామస్ అల్వా ఎడిసన్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలో ఘనంగా ఎలక్ట్రిషన్ డే వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంతో ఎలక్ట్రిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రిషన్ వృత్తిని నమ్ముకుని ప్రభుత్వ నుంచి ఎటువంటి తోడ్పాటు లేకుండా ఉన్నామని అన్నారు. సంక్షేమ పథకాలలో తమకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్, మోయినోద్దీన్ పట్టణ అధ్యక్షుడ గంగన్న, సభ్యులు సురేష్, కాలు, సాయి, అంకుశ్, సంతోష్, మహేష్, పవన్ పాల్గొన్నారు.

ఎంపీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని మారుమూల గ్రామాలకు చెందిన పలువురు సోమవారం ఎంపీపీ పేందూరు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోవలక్ష్మిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలు మారుమూల గ్రామాల్లో సీసీ రోడ్లు, మట్టి రోడ్లు, మందిరాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన వారిలో సిరాజ్, దుందేరావు, విట్టు, సోమాజీ, అన్నారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ టిమ్ డ్రైవర్ల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ టిమ్ డ్రైవర్లు సోమవారం ఉదయం విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్ నుండి హైదరాబాద్ వెళ్లే సూపర్ లగ్జరీ బస్సులకు 3 మస్టర్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ రెండే ఇచ్చి శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. గతంలో మూడు మస్టర్లు ఇచ్చేవారని, అసిఫాబాద్ నుండి దూరం ఎక్కువ కావడంతో నడపడం ఇబ్బందికరంగా మారిందన్నారు. 42 మంది టిమ్ డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లు నిరసన తెలుపడంతో ఉదయం 5, 6, 7 గంటలకు వెళ్లాల్సిన సూపర్ లగ్జరీ బస్సులు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు డిపోకు చేరుకొని మేనేజర్ విశ్వనాథ్‌తో మాట్లాడారు. డ్రైవర్లకు సర్ది చెప్పే ప్రయత్నం చేయగా తమను డిఎం వేధిస్తున్నాడని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తానని డిసిసి అధ్యక్షుడు హామీ ఇవ్వడంతో డ్రైవర్లు వెనక్కి తగ్గారు. ఇదే అంశంపై ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి డిపోకు చేరుకుని కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనేజర్ విశ్వనాథ్ సిబ్బందిని వేధిస్తూ, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ సర్వీస్‌లను ఎక్కువగా, ఆర్డినరీ సర్వీస్ లను తక్కువ చేశాడని ఆరోపించారు. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. డీఎంపై చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డిపో మేనేజర్ విశ్వనాథ్‌ను సంప్రదించగా డిపో తోపాటు సంస్థ అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అవసరమైన మార్పులు చేస్తున్నట్లు వివరించారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసిడిఎస్‌ను వ్యవస్థీకృతం చేయాలన్నారు. అంగన్వాడి టీచర్లను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి టీచర్లకు, హెల్పర్లకు ఇచ్చే గ్రాట్యుటీ కోసం వార్షిక బడ్జెట్లో ఐసిడిఎస్‌కు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. పోషకాహార సమస్య తీర్చే విధిలో అంగన్వాడీలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం విషయాన్ని గమనించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, అంగన్వాడీల యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు అంజలి, వనిత, విజయలక్ష్మి, మల్లీశ్వర, ధనలక్ష్మి, అంబికా, సునిత, సూర్యమణి, లక్ష్మీ, వినోద, రత్నమాల, ఈశ్వరి, సులోచన పాల్గొన్నారు.

మున్సిపల్ ప్రత్యేకాధికారిగా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ ప్రత్యేకాధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సిబ్బంది ప్రత్యేకాధికారిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. మున్సిపాలిటీల పాలకవర్గ పదవీకాలం పూర్తయ్యినందున ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించిందని, ఇందులో భాగంగా తనను కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి ప్రత్యేకాధికారిగా నియమించిందని తెలిపారు. పట్టణాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని అన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

తెలంగాణ ప్రభుత్వం తన మెనీఫెస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ మండలాధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు యూపీఎస్ గెజిట్‌కు వ్యతిరేకంగా సీనియర్ అసిస్టెంట్ జుగాడిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు విజయనిర్మళ, ఉపాధ్యాయులు లక్ష్మీ, సంతోష్, భాషా, ఈశ్వర్‌రావు, ప్రియాంక, అయేషా, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీ టీంలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మహిళలకు రక్షణ కల్పించేందుకే జిల్లాలో షీ టీంలు పని చేస్తున్నాయని షీ టీం సభ్యురాలు సునీత అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ మండలం చింతగూడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు గురైతే వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియాను వినియోగించే విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత భద్రతకు సంబంధించిన వీడియోలు పోస్ట్ చేయరాదని సూచించారు. సైబర్ క్రైంకు గురైతే 1930కు డయల్ చేయాలని, అత్యవసర సమయాలలో 100కు డయల్ చేయాలని సూచించారు. షీ టీం కాగజ్‌నగర్ నెంబర్ 8712670565 ను సంప్రదించాలని అన్నారు.

పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

స్వేరోస్ ఆధ్వర్యంలో ఎలుకపెల్లి పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ సభ్యులు భక్తు నాగేశ్వర్, ప్రేమానందం, ఉపాధ్యాయులు తిరుమలగౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకులకు సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధ్యాపకులుగా ఎన్నికైన కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మినరసింహం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డి జనార్ధన్‌లను సోమవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ కళాశాలకు, విద్యార్థులకు వారు మంచి సేవలను అందిస్తున్నారని, భవిష్యత్తులో కూడా అవార్డులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి తూడూరు దత్తాత్రేయ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



'లక్ష డప్పులు-వెయ్యి గొంతులు'ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే లక్ష డప్పులు వెయ్యి గొంతులు సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌక్ ఎదుట దండోరా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ లక్ష్యంగా నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలన్నారు. వర్గీకరణ అన్ని రాష్ట్రాల కంటే ముందు అమలు చేస్తామని చెప్పి సంవత్సరం పూర్తయిన అమల్లోకి తీసుకురాలేదన్నారు. కమిటీలు కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. మాదిగల ఆవేదన ప్రభుత్వానికి తెలిసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే విధంగా చేపట్టే లక్ష డప్పులు వేయి గొంతులు కార్యక్రమానికి జిల్లా నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పద్మశ్రీ పురస్కారం పొందిన మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేష్, మండల నాయకులు దూడల అశోక్, రేగుంట రాజు, జిల్లా మహిళా నాయకురాలు రేగుంట యశోద, సురేష్, నరేష్, నాగరాజు, శ్రీకాంత్, సాయి శంకర్, రోడ్డ శంకర్, బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు జయరాజ్ పాల్గొన్నారు.

కెరమెరి : హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పులు వెయ్యి గొంతుకల ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోర్ల వెంకటేష్ మాదిగ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుండి మాదిగ ప్రజలు, మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. మాదిగల బల ప్రదర్శన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్దఎత్తున మాదిగలు, ఉప కులాలు, డప్పుకళాకారులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణకు కట్టుబడి ఉండి వెంటనే చేపట్టాలన్నారు. కొంత మంది కుట్రదారులు వర్గీకరణకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కుట్రదారుల అడ్డంకులను అధిగమించి వర్గీకరణ సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు గోగర్ల అశోక్, గౌరవాధ్యక్షులు గైక్వాడ్ రాంచందర్, గోగర్ల రాజయ్య, నాయకులు కంబాల శ్రీనివాస్, చంద్రశేఖర్, తిరుసుల్ల సాయికుమార్, పోర్ల స్వామి, లింగయ్య, పెంటపర్తి మహేష్, రామిళ్ల మహేష్, కూటికల నరసింహ పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ విలీన సభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

ఈ నెల 28న ఖమ్మంలో తలపెట్టిన పీడీఎస్‌యూ విలీన సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి విలీన సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు లెనిన్ మాట్లాడుతూ దేశ విప్లవ విద్యార్థి ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. జార్జిరెడ్డి త్యాగం, జంపాల చంద్రశేఖర ప్రసాద్ అమరత్వం అమరవీరుల అంకితభావం పీడిత విద్యార్థి లోకాన్ని నేటికీ కదిలిస్తూనే ఉందని తెలిపారు. వీరి ఆశయ సాధనలో నిన్నటి వరకు విడివిడిగా కొనసాగిన రెండు పీడీఎస్‌యూ సంస్థలు నేడు ఐక్యమవ్వడాన్ని అనేకమంది విద్యార్థి, విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు హర్షిస్తున్నారని తెలిపారు. ప్రగతిశీల విద్యార్థుల ఐక్యత అనివార్యంగా ముందుకోస్తుందని పేర్కొన్నారు. రెండు సంఘాల కలయిక మరింత బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ మండల నాయకులు సిండే స్వప్న, శిరీష, సంగీత, సౌమ్య, స్వాతి, మమత, గంభీర్, విటల్, ప్రణయ్, మాణిక్ రావు, తరుణ్, తుకారం పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి డి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి ప్రవేశాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం, ఎస్సీ ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతుల్లో ఖాళీల కోసం, గౌలిదొడ్డి, అలుగునూరు సీఓఈలలో 9వ తరగతి ప్రవేశాలు, టీజీ టీడబ్ల్యూఆర్ ఈఐఎస్ ఖమ్మం పరిగి ఎస్ఓఈలలో 8వ తరగతి ప్రవేశాలు, రుక్మాపూర్ సైనిక్ స్కూల్ మల్కాజ్ గిరి ఫైనాన్స్ స్కూల్లలో 6వ తరగతి, గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గలవారు ఫిబ్రవరి 1వ తేది లోపు కుల సర్టిఫికెట్ ఆదాయ సర్టి ఫికెట్, ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23వ తేదిన ఉంటుందని గురుకులల్లో ప్రవేశాలకు సంబం ధించి కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారని, మరిన్ని వివరాలకు హెల్ప్ డెస్క్ నెంబర్ 18005985459ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయులను యూపీఎస్‌లోకి నెట్టవద్దు

నవతెలంగాణ-కౌటాల

ఉపాధ్యాయులకు కేంద్రం ఏప్రిల్ 1 నుంచి అమలు చేయబోతున్న యూపీఎస్ పెన్షన్ స్కీమ్‌లోకి రాష్ట్ర ప్రభుత్వం వెళ్లకుండా, సీపీఎస్ పెన్షన్ స్కీమ్‌ని పూర్తిగా రద్దు చేసి ఓపీఎస్ పెన్షన్ స్కీమ్‌ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తాసీల్దార్ మన్సూర్ అలీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉప్పుల నరసింహ చారి, కౌటాల మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజు, గణపతి, రాష్ట్ర సహాధ్యక్షులు మార్త రమేష్, సీనియర్ సభ్యులు బోర్కర్ రాంచందర్, విజయ్ సింగ్, విట్టల్, శివాజీ పాల్గొన్నారు.

వైన్ షాప్‌లకు జరిమానా

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని వైన్ షాప్‌లకు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సోమవారం కార్యదర్శి సాయి కృష్ణ నోటీసులు ఇచ్చి ఫైన్ వేశారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రత్యేక అధికారి సూచనల మేరకు గ్రామ పంచాయతీ పరిధిలో గల వైన్ షాప్‌ల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశామన్నారు. చుట్టు పక్కల ప్లాస్టిక్ గ్లాస్‌లను విచ్చలవిడిగా పడేసి అపరిశుభ్రం చేస్తున్నారని తెలిపారు. 24 గంటల్లో పరిసరాలను శుభ్రం చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నవతెలంగాణ-జన్నారం

తన్విత ఆయుర్వేద స్కీంతో మోసం చేసిన కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జాడి మురళిని డీఈఓ సస్పెండ్ చేశారు. చీటింగ్ కేసులో అరెస్టు అయి జైల్లో ఉన్నందుకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసినట్లు డీఈఓ ఎస్. యాదయ్య సోమవారం తెలిపారు. జాడి మురళి మండలంలోని కలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మామిడి నర్సయ్యకు తన్విత ఆయుర్వేదిక స్కీంలో అధిక లాభాలు వస్తాయని, మాయమాటలు చెప్పి రూ.24లక్షలు పెట్టుబడి పెట్టించాడు. లాభాలు రాకపోగా డబ్బులు తిరిగి ఇవ్వలేదని, మోసం చేశాడని గత నెల 14న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కొమురయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలు ఉంచుకోవాలని, పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను తరలించవద్దని అన్నారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలోని అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ధూపదీప నైవేద్యం సంఘం జిల్లా నూతన అధ్యక్షులు ఒజ్జల శిరీష్‌శర్మ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రి ఆవరణలోని హన్మాన్ ఆలయంలో సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఎన్నికకు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగు సత్యనారాయణ శర్మ అధికార ప్రతినిధులు సుబ్బా మహేష్, శంకర్‌శర్మ హాజరయ్యారు. నూతన అధ్యక్షులుగా ఒజ్జల శిరీష్‌శర్మ, ఉపాధ్యక్షులుగా అంబేద శంకరయ్య, దేవర వినోద్, తొగిటి వెంకటేశ్వర్, గట్టు సాయిశర్మ, ప్రధాన కార్యదర్శిగా శ్రీసుశర్మ, సహాయ కార్యదర్శులుగా బి కులకర్ణి, మామిడిపల్లి నరేష్, పరమేశ్వర్, సుభాష్‌చారి, కోశాదికారిగా దేవళ్ల శ్రీధర్, గౌరవాధ్యక్షులుగా ఇందారపు శంకర్‌శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శిరీష్‌శర్మ మాట్లాడుతూ రెండో సారి తనకు అవకాశం ఇచ్చి మరింత బాధ్యత పెంచారని అన్నారు. రాష్ట్ర సంఘం సమన్వయంతో జిల్లాలోని అర్చకుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సంతోష్‌శర్మ అభయ్ ఆచార్య, సతీష్, సత్యనారాయణ, వినాయక్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాభివృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్ లో తెలంగాణ అగ్రి డాక్టర్ అసోసియేషన్ డైరీ, 2025 క్యాలెండర్‌ను వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో కృషి చేసి రాష్ట్రంలోనే జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తూ వారికి ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మిలింద్ కుమార్, ఏవోలు మంజుల, విజయకుమార్, దీప్తి, దిలీప్, వినయ్, యుగంధర్, గిరీష్, హేమలత, కార్తిషా పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలుకు వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని కోరుతూ సోమవారం పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందించారు. సెప్టెంబర్ 2004 నుండి అమలవుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం స్థానంలో కేంద్ర ప్రభుత్వం యునైటెడ్ పెన్షన్ స్కీంను తీసుకువచ్చిందని, ఇది కూడా ఉద్యోగులకు నష్టం చేకూర్చే విధంగా ఉన్నందున ఈ రెండింటినీ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. యునైటెడ్ పెన్షన్ స్కీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదవీ విరమణ అనంతరం పూర్తి పెన్షన్ పొందే అవకాశం లేదని, కాబట్టి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు, ఎనగంటి భిక్షపతి, జాడి దేవాజీ, బాలు నాయక్, ముంజంపల్లి రమేష్, ధనలక్ష్మి, చంద్రశేఖర్, రతన్‌గైన్, ఇందూర్‌కర్ వికాస్, మంగతాయారు. డోకె దామోదర్, జాడి పుష్పలత, వెంకటేశ్వర్లు, ఆనంద్‌రావు, సురేందర్, దుర్గం ప్రవీణ్ ఉన్నారు.

వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలో వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్‌ను సోమవారం ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. స్నేహ భావంతో క్రీడలు ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య, టిపిసిసి సభ్యులు అర్షద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్, నహిర్ అలీ, మహేష్, దుర్గం శంకర్ పాల్గొన్నారు.

ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంచాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా నుంచి ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంపొందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, ఉద్యానవన, వెనుకబడిన తరగతుల అభివృద్ధి, బ్యాంకింగ్, వ్యవసాయ శాఖల అధికారులతో జిల్లా ఉత్పత్తుల ఎగుమతి అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, పరిశ్రమల రంగాలను ప్రోత్సహిస్తూ ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంపొందించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను అభివృద్ధి చేస్తూనే అధిక మొత్తంలో ఉత్పత్తుల ఉత్పాదకతను పెంపొందించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేలా కృషి చేయాలని తెలిపారు. ఉత్పత్తుల ఎగుమతిని పెంచే విధంగా అధికారులు కార్యచరణ రూపొందించి ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని తెలిపారు. మామిడి, వరిధాన్యం ఎగుమతులపై అధిక దృష్టి సారించాలని, ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్-స్టోరేజ్ సెంటర్లను ఏర్పాటు చేసి నాణ్యమైన ఉత్పత్తులను ఎగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | జనవరి 28, 2025 | www.navatelangana.com

కోనో కార్పస్ మొక్కల నుంచి కాపాడాలి

నవతెలంగాణ-నస్పూర్



కోనా కార్పస్ విషపు మొక్కల నుండి ప్రజలను, జంతువులను రక్షించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మిడివెల్లి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) మండలం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ మానేజర్ హరినాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు వాతావరణం కాలుష్యంతో రోజురోజుకు అనేక రకాల జబ్బులకు గురై ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పర్యావరణం పేరుతో విషవాయువు ఇచ్చే కోనో కార్పస్ మొక్కలను పెట్టించడం జరిగిందని, ఈ మొక్కల వల్ల శ్వాసకోశ వ్యాధులు అలర్జీ, అస్తమా జబ్బులతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర చారి పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రిషన్ దినోత్సవం

నవతెలంగాణ-మందమర్రి



ప్రయివేట్ ఎలక్ట్రిషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎలక్ట్రిషన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం మార్కెట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో థామస్ ఆల్వా ఎడిషన్ చిత్రపటానికి ఎలక్ట్రిషన్లు నివాళ్లు అర్పించి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ నేడు విద్యుత్ కాంతులతో పగలు రేయి అనే తేడా లేకుండా అన్ని పనులనూ సులువుగా చేసుకునేందుకు కారణం థామస్ ఆల్వా ఎడిసన్ చేసిన విశేష కృషి అని తెలిపారు. థామస్ ఆల్వా ఎడిషన్ బల్బుని కనిపెట్టిన జనవరి 27న ఎలక్ట్రిషన్ దినోత్సవాన్ని ఎలక్ట్రిషన్లమంతా సంతోషంగా పండుగ లాగా జరుపుకుంటామని తెలిపారు. ఎలక్ట్రిషన్లందరూ ఐకమత్యంతో సంఘం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎలక్ట్రిషన్లు, ప్లంబర్లు పాల్గొన్నారు.

ప్రయివేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు



నవతెలంగాణ-జన్నారం

రాఘవేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రయివేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను జారీ చేయనున్నట్లు మాజీ జడ్పీటీసీ, రాఘవేంద్ర ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో పలువురు ప్రయివేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను అందజేశారు. మంచిర్యాలలోని మెడి లైఫ్ ఆస్పత్రి, రాఘవేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. కార్డు ఉన్నవారికి మెడికల్ పరీక్షలు, ల్యాబ్ పరీక్షలు, ఆపరేషన్‌లలో డిస్కౌంట్ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. పలువురు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్, మాజీ సర్పంచ్ లచ్చన్న, పాఠశాల ప్రిన్సిపల్ సతీష్, ఇన్‌చార్జి తిరుపతి ఉన్నారు.

యాత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-తాండూర్



యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విష్ణు కళ్యాణ్ ఆధ్వర్యంలో సోమవారం గడ్డం వెంకటస్వామి (కాకా మెమోరియల్) మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, తాండూర్ సీఐ కుమారస్వామి క్రీడలను ప్రారంభించారు. తాండూర్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జుబైర్ పాల్గొని క్రికెట్ పోటీలను ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ తాండూర్ మండలంలో మొట్టమొదటిసారిగా కాక మెమోరియల్ క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు, ఈ కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్ కుమార్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఈసా, కాంగ్రెస్ నాయకులు శంకర్, శ్రీధర్ మంతెన శివకృష్ణ, గౌస్ ఆదమ్ ఖాన్, జావీద్, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తున్నాం

- మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-జన్నారం



కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో ఉన్న ఎస్సీ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీమ్లను తప్పకుండా అమలు చేస్తామన్నారు. పేదవారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇల్లు, అందిస్తామన్నారు. రేషన్ కార్డులు రైతు భరోసా, ఇచ్చి పేదలను రైతులను ఆదుకుంటామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. పేద ప్రజలకు అండగా నిలుస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాఉఫ్ ఖాన్, ఐసీడీఎస్ సీడీపీఓ రేష్మ, సూపర్‌వైజర్ పద్మ, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, ఇసాక్, మత్స్య శంకరయ్య మామిడిపల్లి ఇందయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకవర్గానికి మాజీ ఎమ్మెల్యే సన్మానం

నవతెలంగాణ-లక్సెట్టిపేట



లక్సెట్టిపేట మున్సిపల్ పాలకవర్గం గడువు ముగిసిన సందర్భంగా వారిని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు అభినందన సమావేశంలో పాల్గొని మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యుల పదవికాలం పూర్తి అయిన సందర్భంగా సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మండల మైనార్టీ అధ్యక్షుడు షేక్ చాంద్ పాల్గొన్నారు.

అక్రమంగా గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్న వాహనం పట్టువేత

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పొన్కల్ మెయిన్ రోడ్ మీద టీఎస్ 01యూసీ 6544 నెంబర్‌గల బోలేరో వాహనంలో ఇండియన్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా తరలిస్తున్న సమాచారం మేరకు ఆ వాహనాన్ని పట్టుకున్నట్లు మండల ఆర్ఐ భానుచందర్ తెలిపారు. ఆవాహన డ్రైవర్‌ను విచారించగా దండేపల్లి నుంచి 62 గ్యాస్ సిలిండర్ల కస్తమర్లకు చేరవేసేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కానీ వారూ ఎటువంటి క్యాష్ మెమో చూపనందున వాటిని స్వాధీన పరచుకొని అట్టి గ్యాస్ సిలిండర్‌లను సేఫ్టీ కస్టడి కొరకు భారత్ గ్యాస్ గోడౌన్‌లో భద్రపరచి రసీదు తీసుకున్నామన్నారు. బొలెరో వాహనాన్ని సేఫ్ కస్టడీ కొరకు పోలీస్‌స్టేషన్ తరలించామని తెలిపారు.

ఓసీ డంపు యార్డు వద్ద గ్రామస్తుల ఆందోళన

- భూములు తీసుకోకుండా రోడ్డు కట్ చేయడం ఏమిటి..?



రోడ్డు పనులు అడ్డుకున్న గ్రామస్థులు

నవతెలంగాణ-జైపూర్

రామారావుపేట్-గోదావరి నది మధ్యన గల రోడ్డును రాత్రికి రాత్రి గుట్టు చప్పుడు కాకుండా కట్ చేయడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇందారం ఓపన్‌కాస్ట్ గని డంపు యార్డ్ వద్ద కొనసాగుతున్న పనులను సోమవారం అడ్డుకున్నారు. రామారావుపేట్-గోదావరి నది మధ్యన గల పురాతన రోడ్డును ఆదివారం రాత్రి కట్ చేసినట్లు గుర్తించిన గ్రామస్తులు సింగరేణి యాజమాన్యం తీరును వ్యతిరేకిస్తున్నారు. మాజీ ఎంపీటీసీ పెద్దల బాపు, మాజీ ఉప సర్పంచ్ తంగళ్లపల్లి వెంకటేశ్, వార్డు సభ్యులు గోలి వెంకటేశ్‌లు ప్రత్యామ్నయ రోడ్డు పనులు ఆపాలని డిమాండ్ చేశారు. కాగా ఓపన్‌కాస్ట్ గని డంపు కోసం రామారావుపేట్ శివారు రైతులు గతంలో 290 ఎకరాల భూమి సమకూర్చారు. ఇంకా 129 ఎకరాల భూమి ఓసీ డంపు కోసం అవసరమవుతుండగా సమకూర్చడానికి గ్రామస్తులు సిద్ధంగా ఉన్నప్పటికి నష్టపరిహారం నిర్ణయం కావల్సివుంది. ఎకరాకు రూ.50 లక్షలతో చెల్లించాలని గతంలో డిమాండ్ చేసిన గ్రామస్తులు చివరికి రూ.30 లక్షల చొప్పున చెల్లించాలని కోరుతున్నారు. ఇదిలావుండగా రామారావుపేట్-గోదావరి నది రోడ్డును కట్ చేసి ప్రత్యామ్నయంగా రోడ్డు నిర్మిస్తున్న తీరును గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నేరుగా ఉన్న రోడ్డును కట్ చేసి ప్రత్యామ్నయంగా డంపు చుట్టు తిప్పుతూ రోడ్డు నిర్మిస్తున్నందున దూర భారం పెరుగుతుందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా మిగిలివున్న 129 ఎకరాల భూమి తీసుకోవడంతో పాటు నష్టపరిహారం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. నేరుగా ఉన్నటువంటి రోడ్డు కట్ చేసి ప్రత్యామ్నయంగా నిర్మిస్తున్న రోడ్డును పటిష్టంగా నిర్మించడంతో పాటు గోదావరి నది తీరం వరకు నిర్మించాలని కోరుతున్నారు. ఇందారం ఓపన్‌కాస్ట్ గని డంపు కోసం 1990 సంవత్సరంలో రామారావుపేట్ శివారు రైతులు 290 ఎకరాలు సమకూర్చారు. ఓసీ అవసరమైన భూములు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నప్పటికి సింగరేణి యాజమాన్యం నష్టపరిహారం నిర్ణయించకపోవడంతో రైతులు ఆంధోళన చెందుతున్నారు. ముందుగా నష్టపరిహారం నిర్ణయించి అవసరమైన భూములు తీసుకున్న తర్వాత రోడ్డు కట్ చేయడం, ప్రత్యామ్నయం రోడ్డు నిర్మించడం కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సంప్రదించినట్లు తెలిపారు. ఒక వైపు శ్రీరాంపూర్ ఓసీ డంపు, మరో వైపు ఇందారం ఓసీ డంపు రామారావుపేట్ చట్టు గుట్టలుగా పేరుకుపోతుండటం ఇబ్బందిగా మారిందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఓసీ బ్లాస్టింగులతో పాటు డంపు నుండి వెలువడే దుమ్ముతో శ్వాసకోష సంబంధిత వ్యాధులు వస్తున్నాయని గ్రామస్థులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.ఆరు లక్షల ఆస్తి నష్టం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో గోల్కొండ పోచమల్లు ఇల్లు దగ్ధం అయింది. విషయం తెలుసుకున్న మండల ఫైర్ అధికారి శ్రీనివాస్ తన సిబ్బందితో హుటాహుటిన వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్రామంలోని యువకులు బిందెలతో బకెట్లతో మంటలను ఆర్పి వేశారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ భనుచందర్, పంచాయతీ సెక్రటరీ, లావణ్య పరిశీలించారు.

నిత్యావసర సరుకులతో సహా అన్ని దగ్ధం

ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులతో సహా అన్ని దగ్ధమయ్యాయని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. వారి పిల్లల స్టడీ సర్టిఫికెట్ పాస్‌పోర్ట్, కర్ర వస్తువులు, 2 తులాల బంగారం, రూ.లక్ష నగదు, 4 క్వింటళ్ల బియ్యం ఎలక్ట్రానిక్ వస్తువుల దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో మొత్తం రూ.6 లక్షలవరకు ఆస్తినష్టం జరిగినట్టు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి తెలిపారు. తక్షణ సాయం కింద ప్రభుత్వం ద్వారా అందే విదంగా చూస్తామని తెలిపారు.



బాధిత కుటుంబానికి చేయూత

పోచమల్లు కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి పరామర్శించారు. ఆ కుటుంబానికి నిత్యవసర సరుకులు, దుప్పట్లు, నగదు ఆర్థిక సాయం అందించారు. ప్రస్తుతం నివాసం ఉండడానికి రేకులకు కావలసిన రూ.15 వేలు తక్షణ సాయంగా అందిస్తామని తెలిపారు. వారికి ఇందిరమ్మ ఇల్లు, మంటల్లో కాలిపోయిన వారి పిల్లల సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎంఈఓ, తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా సూచించారు. ఈ ఘటనపై మంత్రి సీతక్కతో మాట్లాడి సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.



రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్



నవతెలంగాణ-మందమర్రి

రోడ్డు భద్రత నియమాలు పాటిద్దాం-సురక్షితంగా గమ్యాన్ని చేరుదామని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ వాహనదారులకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సోమవారం సీఈఆర్ క్లబ్‌లో ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ పోలీస్ సిబ్బందితో ఆటో డ్రైవర్లకు, విద్యా సంస్థల వ్యాన్ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు, ప్రజలకు రోడ్డు నిబంధనల పై అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి మంచిర్యాల బృందం పాటల ద్వారా వాహనదారులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించి వాహనాలు నడిపి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మజీద్, స్టేషన్ సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, వాహనదారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు అందించాలి



నవతెలంగాణ-కాసిపేట

మంచిర్యాల జిల్లాకు ఆసిఫాబాద్ కొంరంభీం జిల్లా ఆడ ప్రాజెక్ట్ నుంచి వచ్చే మిషన్ భగీరథ నీరు గత కొన్ని రోజులుగా రావడం లేదని, మంచిర్యాల గంగ నుంచి మిషన్ భగీరథ నీరు అందించాలని తెలంగాణ ఆల్ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అట్కపురం రమేశ్ కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీఓ శేఖ్ సఫ్దర్ అలీకి వినతిపత్రం అందించారు. అందేవిదంగా ఆదివాసీ నాయక్‌పోడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మల బాపు, మండల ప్రధాన కార్యదర్శి మేండ్రపు రాజన్న ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి పౌష్టిక ఆహారం అందిచాలని కోరారు. కేంద్రాలు లేక పిల్లలు, గర్భిణీలు పౌష్టికాహారం అందక రక్తహీనతో బాధ పడుతున్నారని, 27 గిరిజన గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

31లోగా రైతులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

యాసంగి సీజనుకు సంబంధించి రైతులు రైతు భరోసాకు జనవరి 31లోపు దరఖాస్తు చేసుకోవచ్చని జన్నారం ఏఓ సంగీత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. 2025 జనవరి 1 వరకు కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు ఆధార్ కార్డ్, పట్టా పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ల జిరాక్స్ కాపీలను ఏఈఓలకు అందజేస్తే అప్డేట్ చేసి ప్రభుత్వానికి పంపుతామని వివరించారు రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు సాంకేతిక ప్రదర్శన

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని ఉషోదయ హై స్కూల్‌లో ఇస్రో, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మంగళవారం సైన్స్ పై సాంకేతిక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బాలాజీ పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భారత దేశ రక్షణ కోసం క్షిపణి వ్యవస్థ సాంకేతితను రూపొందించే ప్రయోగశాల, భారత సాయుధ దళల రక్షణకు సంబంధిత పలు అంశాలపై విద్యార్థులతో ముఖా ముఖి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా వేరు వేరు ప్రాంతాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావులతో పాటు జిల్లాకు చెందిన 500 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు ట్రస్మా సభ్యులు వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి విద్యార్థికి ఉత్తమ అవార్డు

నవతెలంగానం-తాండూర్

హైదరాబాద్‌లోని షేక్‌పేటలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ ప్రీమియర్ సీఓఈలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న బెల్లంపల్లి విద్యార్థి ప్రథమ్ పాండే ఉత్తమ విద్యార్థి అవార్డు అందుకున్నారు. విద్య, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు విద్యార్థికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ విద్యార్థి అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు గురువారెడ్డి, హౌస్ మాస్టర్ ఇస్మాయిల్ మహ్మద్, బాలకృష్ణ, బాలరాజు పాల్గొన్నారు.



రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించాలని హైకోర్టు తీర్పుపై హర్షం

నవతెలంగాణ-కాసిపేట

141 రైతుల ఆత్మ హత్యలు వాస్తవమేనని, రైతు కుటుంబాలకు ఈ నష్ట పరిహారం వర్తిస్తుందని హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వడం పట్ల తెలంగాణ జన సమితి నాయకులు గోనెల శ్రీనివాస్, గోనెల శ్రీలత విద్యావంతుల వేదిక నాయకులు ఎరుకల చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. 2014 జూన్ రెండు తర్వాత పంట నష్టం కారణంగా ఆత్మహత్య చేసుకున్న రైతులకు ఆరు లక్షలు పరిహారం చెల్లించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ 173, 194 జారీ చేసిందని, ఈ జీఓ ప్రకారం ఎవరైనా రైతు లేదా కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడితే ఆర్డీఓలేదా డీఎస్పీ లేదా అగ్రికల్చర్ ఏడీతో కూడిన త్రీ మెన్ కమిటీ విచారణ జరిపి ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుందని, ప్రభుత్వం పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అప్పట్లో పంట నష్టం, అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేసిన త్రిమాన్ కమిటీ రిపోర్టు సమర్పించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని కుటుంబాలకు మాత్రమే నష్టపరిహారం చెల్లించి మిగతా చాలా కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఇలాంటి కుటుంబాలను రైతు స్వరాజ్య వేదిక వారి దృష్టికి బాధిత రైతు కుటుంబాలు తీసుకురావడం జరిగిందని, ఈ విషయాన్ని ఆనాడు హైకోర్టులో కొండారెడ్డి రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ కేసు వేయడం జరిగిందని, ఇట్టి కేసును సుధా నాగరాజు అనే న్యాయవాది వాదనలు వినిపించడం జరిగిందన్నారు. ఈ విషయమై రైతు స్వరాజ్య వేదిక కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-1వ గని, 2 ఇంక్లైన్ గనిపై టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాసిపేట-1వ గనిపై టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు వొడ్నాల రాజన్న, పిట్ కార్యదర్శి బైరి శంకర్లు యూనియన్ జెండా ఆవిష్కరించారు. కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై బీ రిలే టీబీజీకేఎస్ నాయకులు కోల్ కట్టర్ రాజయ్య, సపోర్ట్ మాన్ రాజయ్య చేతుల మీదుగా యూనియన్ జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు బెల్లం అశోక్, సొల్లంగి శ్రీనివాస్, అఫ్జలుద్దీన్, బండారి రమేష్, డీ రమేష్, మైఖల్ కృష్ణ, వెంకటేష్, సింగతి కృష్ణ, పోషం, రాజ్ కుమార్, మురళీ, తేజ, యాదగిరి, జగన్, సత్య ప్రసాద్, కారుకూరి వెంకటేష్, టెండల్ తిరుపతి, కేదరి, దినేష్, కలాలి రాజేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని సంజన జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వరంగల్ జట్టుతో తలపడగా 30 బంతుల్లో 36 పరుగులు, 6 ఫోర్లు సాధించినట్లు పాఠశాల పీడీ సిరంగి గోపాల్ తెలిపారు. ఖమ్మం జట్టుతో 10 బంతులకు 15 పరుగులు తీసి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు హర్యాన రాష్ట్రంలోని పంచకులలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. సంజనను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, డీఈఓ యాదయ్య, డిప్యూటీ ఎస్ఓ రాజవీరు, హెచ్‌సీపే కార్యదర్శి ప్రదీప్, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీధర్, ఎస్ఎంసీ చైర్మెన్ సునిత, ప్రధానోపాధ్యాయులు నాగోత్ శ్యాంసుందర్ అభినందించారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన మురిమడుగుల ఇసాక్ అనారోగ్యంతో మృతి చెందడంతో తన కుటుంబాన్ని మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ పరామర్శించారు. రూ.5 వేలు, 50 కిలోల బియ్యాన్ని అందించారు. ఇదే విధంగా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, నాయకులు భరత్, రాజేశ్వర్, ప్రభుదాస్, లచ్చన్న ఉన్నారు. అదేవిదంగా నేతకాని సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో పరామర్శించారు. అనంతరం వారికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, నాయకులు ఐరగడ్డ దత్తు, దుర్గం నందయ్య, జునుగురు మల్లేష్ ఉన్నారు.

బెల్లంపెల్లి ఏసీపీకి సన్మానం

నవతెలంగాణ-తాండూర్



తెలంగాణ దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం బెల్లపెల్లి ఏసీపీ రవికుమార్ ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అత్యుత్తమ విశిష్ట సేవలకు గాను ఉత్తమ ఉద్యోగిగా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత సంఘాల ఐక్యవేదిక బెల్లంపల్లి అధ్యక్షుడు కుంభాల రాజేష్, దుర్గం గోపాల్, రత్నం ఐలయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఆదిలాబాద్
మంగళవారం | జనవరి 28, 2025 | www.navatelangana.com

ఎన్‌హెచ్‌ఏఐ జీఎంని కలిసిన ఆప్ జిల్లా కన్వీనర్

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామం మీదుగా వెళుతున్న ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారి విస్తరించడం వల్ల గ్రామానికి సర్వీస్ రోడ్డు లేకుండా పోయిందని, దీంతో గ్రామస్తులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే దీనికి సంబంధించి తగు పరిష్కారం చూపించాలని ఆప్ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. సోమవారం ఢిల్లీలోని ఎన్‌హెచ్ అథారిటీ ఆఫ్ ఇండియా జీఎం డీకే చతుర్వేదికి వినతిపత్రం అందజేశారు. హైదర్‌తో పాటు నయన్ పాషా, శ్రీనివాస్, అరవింద్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి అనసూయ దంపతులు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకొన్న డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలను తెలుసుకొని, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ అబ్దుల్ హాదీ, బొల్లోజు నర్సయ్య, వెంకట రమణరెడ్డి, అట్లా పోతారెడ్డి, కొత్తకాపు పోత రెడ్డి, విలాస్‌రావ్, ముత్యంరెడ్డి, నవీన్‌రెడ్డి, భోజన్న, బొమ్మెడ సత్యం, రాజ్ కుమార్, షఫీ, లింగారెడ్డి, రవి రెడ్డి ఉన్నారు.



సమస్యలను చట్టప్రకారం పరిష్కరించాలి

- ఎస్పీ డా.జానకి షర్మిల



నవతెలంగాణ-నిర్మల్

ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన సమస్యలను చట్టప్రకారం పరిష్కరించాలని ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల ఎస్సైలు, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన టోల్ ప్లాజా సిబ్బంది

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలం గంజాల్ టోల్ ప్లాజాలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టోల్ ప్లాజా సిబ్బంది మాట్లాడారు. ఇటీవల ఫేర్వేస్ టోల్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీ టోల్ ప్లాజాను కాంట్రాక్ట్ తీసుకుందని కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించేందుకు సిద్ధమైందని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రాజేశ్వర్, రాము, శ్రీనివాస్ వర్మ, నరేంద్ర పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి ప్రారంభం

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి సమాచార సహాయ కేంద్రం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మండల కేంద్రంలోని ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు ఏ సందేహాలున్న ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని, ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలందరూ కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ సిబ్బంది సంతోష్, విమల బాయి, వినోద్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి కృషి చేస్తాం

నవతెలంగాణ-జైనథ్

పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళల కృషి చేస్తామని మండలంలోని కరంజి(కె) వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం వీడీసీ ఆధ్వర్యంలో ఎల్ఈడీ టీవీని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయిందని, విద్యార్థులు ఇటువంటి వాటిని సద్వినియోగ పరచుకొని, తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. పాఠశాలకు ఎల్లవేళలా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడానికి గ్రామ ప్రజలం ముందు ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, కార్యదర్శి నాగజ్యోతి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నవతెలంగాణ-జైనథ్

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎస్సై వి.పురుషోత్తం అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహన వినియోదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, హెల్మెట్ తప్పకుండా ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుకై కృషి చేస్తా

నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్ట్ కార్మికుల మెరుగైన వేతనాల పెంపుకు కృషి చేస్తానని మినిమం వేజెస్ బోర్డు చైర్మన్, ఐఎన్టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ అన్నారు. సోమవారం సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఇన్‌చార్జి భీమ్ రవి అధ్యక్షతన శ్రీరాంపూర్ యూనియన్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ డిపార్ట్మెంట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం వారికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం-కాంట్రాక్టర్ల కక్ష్య సాధింపు చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కలవేణ శ్యామ్‌లు మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి నూతన నాయకత్వం కృషి చేయాలని సూచించారు. అధ్యక్షుడు సిరిపురం రాజేష్, ఉపాధ్యక్షులు దాడి రాజేష్, జాదవ్ భరత్, పున్నం నాయక్, ఆడెపు అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఆవుల రమేష్, సంయుక్త ప్రధాన కార్యదర్శులు పెద్ది ఓదెలు, బొద్దుల నరేష్, సహాయ కార్యదర్శి ఎ కుమారస్వామి, ఎ సంపత్ కుమార్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాందేని శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎం రజిని కుమార్, పి కుమార స్వామి, ఎల్ రవి, నూనె శ్రీకాంత్, ఎస్ బాపు, ఇ రవీందర్ రావ్, కోశాధికారి మైదం రవి ఎన్నికయ్యారు.

అంకితభావంతో పోలీసులు విధులు నిర్వర్తించాలి

నవతెలంగాణ-నస్పూర్

అంకితభావంతో పోలీసులు విధులు నిర్వర్తించాలని సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ అన్నారు. సోమవారం శిక్షణ ఎస్ఐలు సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుగుణాకర్ వారికి పోలీస్‌స్టేషన్ రికార్డుల నిర్వహణ, ఫంక్షనల్ వర్టికల్‌లో రిసెప్షన్, అడ్మిన్, స్టేషన్ రైటర్, ఎస్హెచ్ఓ వర్టికల్స్‌ను వివరించారు. అనంతరం సుగుణాకర్ మాట్లాడుతూ ప్రజలతో మమేకమై పని చేయాలన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

నవతెలంగాణ-ఉట్నూర్



అటవీ భూముల సర్వేల పేరుతో గతంలో జరిగిన అవకతవకలను సరి చేసి, అర్హులందరికీ పట్టాలు అందజేయాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వెంకటాద్రి అన్నారు. సోమవారం గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ ఏపీఓ జాదవ్ వసంతరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలిచ్చి వారికి భద్రత కల్పించాలన్నారు. పట్టాదారులకు వర్తించే అన్ని రుణ సౌకర్యాలను వారికి కూడా వర్తింపజేయాలన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వాస్తవ సాగుదారులను పట్టాలు ఇవ్వాలనీ కోరారు. ఉట్నూరు, జన్నారం ప్రాంతంలో ఇండ్లు లేని పేదలు నివసిస్తున్నారు. ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అధ్వనంగా ఉన్న రహదారులను రోడ్లను తక్షణమే బాగు చేయాలన్నారు. అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్న వారికి పరిహారం చెల్లించి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సోయం జుగాదిరావు, నిర్మల్ జిల్లా అధ్యక్షులు సున్నం రాజమౌళి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ధారంగుల ఎల్లయ్య, ఉపాధ్యక్షులు ఇనుముల నర్సయ్య, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు వాగ్మారే సంబాజీ. ఉపాధ్యక్షులు సిడం ధర్మం పటేల్, బోడ కిషన్, మల్లేష్, నవోదయ మహిళా విముక్తి సంఘం జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి. మోరే గణేష్, ఓపీడీఆర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంబాల మహేందర్, ఎనుముల శంకర్, పేద ప్రజలు పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణిని వినియోగించుకోవాలి



నవతెలంగాణ-బోథ్

సీఎం ప్రజావాణిని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క జిల్లాలో రైతాంగం ధరణి సమస్యలు పరిష్కరించడానికి, ఆదివాసి గిరిజన పోడు హక్కుల కోసం, ఉపాధి హామీ పనిలో ఉత్పన్నమవుతున్నసమస్యల పరిష్కారం కోసం రైతు ఆత్మహత్యలు విద్యుద్ఘాతంతో చనిపోయిన వారికి పరిహారం అందకపోతే తాగునీటి కష్టాలకు తొమ్మిది శాఖలకు సంబంధించిన ప్రత్యేక సమస్యలను గుర్తించి, సీఎం ప్రజావాణి అనే పథకాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఆదిలాబాద్ జిల్లాను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి కార్యాలయం చేత ప్రతిరోజు నిఘా పర్యవేక్షణ ఉంటుందని సమస్యలను వాటిని పరిష్కరించేందుకు పలువురు అధికారులకు అధికారాలు ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీటివల్ల ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు ఆర్థిక భారం, దూర భారం సమయం మిగులుతోందని అన్నారు. ఈ కార్యక్రమం సెలవు రోజుల్లో తప్ప అన్ని పని దినాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు గాజుల పోతున్న పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రిమ్స్‌లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం రిమ్స్ ఓపీలో 13 స్వచ్ఛంద సంస్థల సహకారంతో రోగుల సాయం కోసం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయగా ఆయన ప్రారంభించారు. అనంతరం వయోవృద్ధుల సమాఖ్య సంఘం ప్యాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నిత్యం రిమ్స్‌కు వచ్చే రోగుల సాయం కోసం స్వచ్ఛంద సంస్థలు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారని అన్నారు. ఓపీతో పాటు వార్డులకు వెళ్లేందుకు ఇక్కడ స్వచ్ఛంద సంస్థల నుంచి వాలంటీర్లతో పాటు రిమ్స్ సిబ్బంది కూడా ఉంటారన్నారు. రోగులకు సరైన సూచనలు చేస్తారన్నారు. రక్తదానంలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్ మొదటి స్థానంలో వచ్చిందన్నారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలు ఇచ్చే అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలు వారి సమస్యలను తెలియజేస్తూ అర్జీలను ఇవ్వగా వాటిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామల దేవి మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఇచ్చే వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించి, పరిష్కార మార్గాలను అన్వేశించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు ఉన్నారు.

ఫీజు రియంబర్స్‌మెంట్ రాక చదువులకు దూరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్న కారణంగా పేద విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిన పరిస్థితులున్నాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెస్రం భాస్కర్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలనే డిమాండ్‌తో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల 700 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యార్థులతో పాటు యాజమన్యాలు కూడా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. తల్లిదండ్రులు కూలీనాలి చేసి ఫీజులు చెల్లించి, సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే కళాశాలు మూసుకునే పరిస్థితులు వచ్చాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి, పెండింగ్‌లో ఉన్న వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్, ప్రవీణ్, శిరీష, స్రవంతి, నిషా, శివని, ప్రణయ్, సాయికిరణ్ ఉన్నారు.

నాగోబా జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా దేవాలయాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం దర్శించుకున్నారు. మర్రిచెట్టు వద్ద బస చేస్తున్న మెస్రం వంశస్థులని కలిసి ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని సంభందిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట మాజీ ఎంపీ సోయం బాపూరావ్, ఆలయ కమిటీ చైర్మెన్ ఆనంద్‌రావ్ ఈఓ రాజమౌళి ఉన్నారు.

బోథ్ మండల నోడల్ అధికారికి సన్మానం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నూతనంగా మండల నోడల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మహమూద్ హుస్సేన్‌ను పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షులు ఆర్‌టీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సంగు స్వామి, జిల్లా అసోసియేట్ సభ్యులు బిక్క, గంగయ్య రవిరాజ్, గంగయ్య రమణ, లక్ష్మారెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక సేవకులకు ఆత్మీయ సన్మానం

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు విద్య ఉద్యోగ మార్గదర్శకుడు కౌటిక శ్రీనివాస్, అలాగే పక్షులకు ప్రకృతికి చేస్తున్న సేవకుడు జక్కుల వెంకటేష్, సేవ కార్యక్రమాలకు గుర్తింపుగా 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నిర్మల్ జిల్లా వాసవి వర్ల్డ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీబీఐ మాజీ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ సరస్వతీ మాత ఫోటో, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పుస్తకాన్ని అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

నవతెలంగాణ-బోథ్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మురళీకి వినతిపత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంగు స్వామి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బిక్క గంగయ్య, రవిరాజ్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా వాణి కార్యక్రమాన్ని మండల అధికారులు ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు తమ సమస్యలపై సంబంధితశాఖ అధికారులకు దరఖాస్తులు అందజేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, దరఖాస్తులు స్వీకరించారు. మండల ప్రజలు తమ సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ శేఖర్, తహసీల్దార్ రాజమోహన్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రోహిదాస్, మండల సిబ్బంది నగేష్, ఉమా, సాయికుమార్, హరికాంత్, లింగన్న, నరేందర్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

టీఏజీఎస్ క్యాలండర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నూతన సంవత్సర క్యాలండర్లను స్థానిక తహసీల్దార్ ఎం.ప్రవీణ్, పోలీసు స్టేషన్‌లో ఎస్సై డి.సునీల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాకటి విష్ణు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

నవతెలంగాణ-నేరడిగొండ

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సోమవారం పీఆర్టీయూటీఎస్ సంఘ సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు కట్కూరి గంగాధర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మహిళ అధ్యక్షురాలు మల్లీశ్వరి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట రమణ, రాష్ట్ర మహిళా కార్యదర్శి శారద పాల్గొన్నారు.

హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

లోడింగ్, అన్‌లోడింగ్ తర్పాలిన్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏనుగు రవిందర్‌రెడ్డికి సోమవారం హమాలి వర్కర్స్ ఘనంగా సన్మానించారు. సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ జనరల్ సెక్రటరీగా నియమించినందుకు(ఐఎన్టీయూసీ) ఆల్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డికి తెలంగాణ కనీస వేతనాల కమిటి బోర్డు చైర్మన్ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.